కామకవి

శతావధాని వేలూరి శివరామశాస్త్రి గారు

౧

కామన్నకు లక్షణము రాదు; వ్యాకరణ మసలే రాదు. పది పుస్తకము లయితే చదువుకొన్నాడు కాని అతనికి వానిలో ప్రతి పదమును అర్థమయినదన్న మాటయు లేదు. కాని అతడు చాటుపద్యము చెప్పినాడన్నచో గాలి దాని నన్నిదిక్కులకు తీసికొనివెళ్లునట్లు ప్రచారమయి పోవును.

కొంగను కొట్టిన బోయవానిపై వాల్మీకి యొక్క ఆదికవిత్వము బయలుదేఱినది: కోపముచేసి గురువుగారి మీద కామన్నయొక్క ఆదికవిత్వము బయలుదేఱినది. దానితో కామన్న కామకవి అయినాడు.

గురువుగారి కోపమునకు ఒక హేతువున్నది. అసలు గురుశిష్యుల మార్గములే భిన్నములు. గురువుగారికి గులకరాలవలె నోరి కడ్డముపడు పదములు, టెంకాయ పాకము కల పద్యము లనినచో ప్రాణము. వారా పద్యములు వివరించి వివరించి చెప్పుచుండెడివారు; వానినే వల్లింపుమనుచుండెడువారు.

ప్రయత్నముచేసి తెలిసికొనవలసిన పద్యము లనినచో శిష్యునికి శిరోవేదన; గులకరాలవంటి పదము లనినచో నతనికి దవడతీపు; టెంకాయపాక మనినచో వాని కోకర.

ఇటు లొకరేటికి, మఱియొకరు కోటికి తీయుటచేత కామన్న చదువు మూలబడినది. అతడు కామకవి అయిపోవుటచే గురువుగారి కడకు రాకపోకలు చేయవలసిన పని తీఱిపోయినది. కాని అతడు మంచి దనుకొన్న పుస్తకములు తెప్పించి చదువుకొన మొదలుపెట్టినాడు. గురుబోధ లేకయే తెలియుచుండుటవలన గలిగిన గర్వముయొక్క మహావేగముచే చాల పుస్తకములు పఠించినాడు. ఒక్కొక్క పుస్తకమును రెండు మూడు నాలుగు మాఱులను పఠించి చెఱకును సగము మాత్రమే నమలగలిగితి నని అనుకొనజొచ్చెను.

ఏదేనివస్తు వనుభవపతితమై మనస్సు విశాలమైనపుడతడదేపనిగా కవిత్వమల్లును. 'ఈవేళ ఏమిపద్యములు చెప్పితివి? వినిపింపు' మని అందఱును అతనికడ పడిగాపులు కాయుచుండువారు. కామకవి మనోహరముగా వానిని గానముచేసి వారివారిని తనుపుచుండువాడు. అతని పద్యములను ఆపద్ధతితో పత్రికలు ప్రకటించుకొనుచుండెడివి. 'ఈపత్రికలో కామకవి పద్యములున్నవా' యని చదువరు లడుగుచుండెడువారు. పండితలోకము మాత్రము 'అబ్బే! అతి తేలిక పాకము! ఆడుదానికి కూడ అర్థమగును. ఒక అనుప్రాసమా? ఒక శ్లేషయా? ఒక బంధమా? ఒక ఏకాక్షర కందమా?' అని అనుకొనుచుండెడువారు.

౨

బాపట్లలో కామకవి చుట్టాలయింట వివాహము. కామకవి రయిలులో బాపట్లకు బయలుదేఱెను. అవి కాలేజీలు, హైస్కూళ్లు తెఱచురోజులు కాబట్టి విద్యార్థులు గుంపులు గుంపులుగా ఆరైలులోనే చెన్నపట్నము వెళ్లుచున్నారు.

క్రొత్తవానికి రైలులో పోవుటయే ప్రొద్దుపోక. అతఁ డెల్లపుడును గుమ్మముకడనే కూరుచుండి నేల రివ్వునఁ బరువెత్తుట చూచును; వంతెన లెన్నియున్నవో, ఏ స్టేషను ఏవైపుననున్నదో గుఱుతుపెట్టుకొనును; దగ్గఱ డైరీయున్నచో అందు వ్రాసికొనుచుండును; ప్రతిస్టేషనులోను తాను దిగిపోవువానివలె తలుపుకడకు పరుగెత్తును. తెరువరులకు వాఁడొకపిచ్చివాఁడేకాని పాపము మాయికుఁడు.

ప్రాఁతవానికి రైలొక నూతన. 'అబ్బా! ప్రతిస్టేషనులోను పన్నుండుట నేమి?' అని నిందించును. చీట్లపేకయో, ఫలాహారమో, సంగీతమో, వివాదమో లేనిచో ప్రొద్దుపోదు. దానిమాట యేటికి? రైలే కదలదు. వాఁడితరులమీఁద కాళ్లుపెట్టి నిద్రించును. అయ్యది తన స్వగృహమయినటులు చేరువవారును లోనికిరాకుండ గెంటును. వాఁడు దిగిపోవునపుడు ఆస్థలమును శ్మశానమువలె విసర్జించి లేచిపోవును.

ఆరైలులో పయనించు వెంకటరావునకు కాలేజీ విద్యార్థులందఱకుం బలె పాటలోను, భాషలోను ఆసక్తియున్నది. అతఁడు కామకవిని పోల్చి ఆబండిలోనే తాను పయనించుట సఫలమని కామకవితో అనెను.

గాయకుఁ డనఁగను, కవియన్నను కడు లోకువ. అడుగుటయే తరువాయిగా కొందఱును, మొగమును కనిపట్టియే కొందఱును గానముచేయ నారంభింతురు. ఒకవేళ తాము బెట్టుచేసి వినిపింపకున్నచో, ఇంకను లోపమున్నదని సరస్వతి లోలోపల నవ్వుకొని పోవునేమో యని వారు భీతిల్లుదురు. కాఁబట్టి వా రించుమించుగా 'Public property'.

వెంకటరావు కోరికమీఁద కామకవి లోఁగడ తాను చెప్పిన చాటుపద్యములు వినిపింప మొదలిడెను. అతని పాఠధోరణి కొంత గుఱ్ఱపుకదనువలెను, కొంత వృషభచలనమువలెను, పోనుపోను ధూమశకటధ్వనినే శ్రుతిగాఁ జేసికొన్న ఒకానొక నిశ్చలోచ్చైస్స్వరమున సంపన్నమయి యుండెను. అతని ముఖమున ఆనందము వెల్లివేయఁబడి నటులుండెను. సభ్యులలో నెచటను అలికిడి లేదు. అపుడు ధూమశకటముకూడ తనచప్పుడు నుపసంహరించుకొని వానిగానమును వినుచున్నదా యనునటులు దానిధ్వని యెవరికిని గోచరించుటయే లేదు. తెనాలిస్టేషను కడ రైలు నిక్కముగా చప్పుడు మాని ఆఁగి వినఁదొడఁగినది. కామకవి కవితాస్వరము రెండింతల వికాసముతో జనుల నాకర్షించినది. వినుటకే కాఁబోలు రైలు అక్కడ పదినిమిషము లెక్కువ ఆఁగినది.

శ్రుతిలేనిపాట కష్టమని రైలు మఱల శ్రుతివేసెను. అతఁ డీశ్వర లీలపై వ్రాసినపద్యములు ప్రతివానిని పాతులోనికి కదిలించి వైచినవి. అతఁడు క్రమక్రమముగా వానిని చదివి చాలించెను.

'భాషాసంగీత'మని ఒకఁడు, 'భావసంగీత'మని ఒకఁడు 'Wave of bliss' అనిఒకఁడు, 'Gamut of Appolo' అని ఒకఁడు, 'Song of the Soul' అని ఒకఁడు కీర్తించిరి.

రుచిభేదములేక పదార్థమని ఒకటి ఉండదు. నింద లేక స్తుతి పూర్ణము కాదు. స్వరూపసాక్షాత్కారములేని భక్తుఁడు భగవంతుని దివ్య కళ్యాణ గుణములు నుతించి నుతించి నిందింప మొదలిడును. నిషేధము విధిలో లీనమయినపుడే అది సమగ్రమయి యుండును.

అపు డచట వినుచున్నవారలలో వైయాకరణ శిరోమణి యగు అనంతకృష్ణశాస్త్రి అతని కవితనంతయు వినివిని తుదకు కామకవిని చూచి "అయ్యా తా మేమి పఠించితి"రని యడిగెను.

"అయ్యా! నేనేమియు చదువుకొనలేదు."

"ఆసంగతిని మీకవిత్వమే చెప్పక చెప్పుచున్నది అనఁగా వాచ్యముగా చెప్పుచున్నది. మీరు దండిపండితు లయినఁగాని మీకవిత్వము రాణింపదు. అది యటుండె. మీరేమి చదివి దీనిని వ్రాసినారు?"

"అయ్యా! నాకటులు తోఁచినది; వ్రాసితిని. ఇటులు చెప్పుటకు, ఏమిచదువుకొనుట, కేమిపని?"

"ఓహో! వ్యాకరణమురాక కవిత్వమా! అది నపుంసకీకరణము; అలంకారము లేక కారము; పాకము లేక శోకము; శయ్య లేక కొయ్య; వ్యంగ్యము లేక భంగ్యము. కవిత్వమనఁగా గొల్ల సుద్దులా? నైషధము చూచితివా? చూచుకొలఁది దానినుండి వింతలు దొంతులుగా పుట్టుకొనివచ్చును. కవిత్వమనఁగా అది; అది విద్వత్ కవిత్వము. —విద్వత్కవయః కవయః కేవలకవయః కేవలంకపయః" అని రెండుశ్లోకములు చదివి వ్యాఖ్యాన మనువదించి అందలి ఒకొక్కపదమునకు వ్యుత్పత్తి ప్రత్యయోత్పత్తి నిఘంటువులు, వ్యంగ్యవీచికలు, అలంకారములు, శయ్యలు, పాకములు మొదలగువానిని అనంతకృష్ణశాస్త్రి ఉపన్యసించుచుండఁగా బాపట్ల వచ్చెను. అతఁడు 'నాయనా! చెడిపోవుచున్నావని ఇంతవట్టు చెప్పితిని. ఇఁకనైనను చదివి విద్వత్కవివి కమ్ము' అనియెను.

"మీకడనే చదివికొనవలయునా?" అని కాలేజీ విద్యార్థు లనిరి. అనంతకృష్ణశాస్త్రి ఈర్ష్యనే ఒకచూపుగా చూచెను.

అనంతకృష్ణశాస్త్రి శిష్యు లూరక కూర్చుండలేదు. "కామకవిగారూ! వంపుక అని ప్రయోగించితిరే; ఇదెట్లు సాధువు? అర్ధానుస్వార శకటరేఫ సాంకర్యము కలిగించితిరే? అది కవిత్రయానుమతమా? 'దేవానాంప్రియ' శబ్దమును అన్యసమాసఘటితము చేసితిరే! అది అపాణినీయమే!" అనుచు ప్రశ్నపరంపర పరఁగించిరి.

"అయ్యా! నాకవియేవియు రావు. నాకటులుతోఁచినది; చెప్పితిని. లెస్సగా నున్నయెడల వినుఁడు; లేదా పోనిండు" అని కామకవి యూరకుండెను.

"కవిత్వమునకువ్యాకరణదోషములకును ఏమియు సంబంధము లేదు. వేమన్న పద్యముల కానందింతురు. తెప్పలు పట్టరేల? వానిలో తప్పులు లేవా? పండితులు తప్పులనుకొను తప్పులతడకయే అది. కాని ఆతప్పుల నతిక్రమించి అందలికవిత్వ మట్టెత్తినది." అని కాలేజీ విద్యార్థులు స్వతంత్ర వాదమును నెలకొల్పఁ దొడఁగిరి.

ఈవివాదమును సహింపనిదానివలె రైలు గుప్పుగుప్పుమని ధ్వనిచేయుచుఁ బట్టాలపై అనేక జర్జర స్వరము లుదయింప వాని శాసించుచందమున తానును అఱచుచు స్టేషనుముం దాఁగెను. అనంతకృష్ణశాస్త్రి శిష్యసమేతుఁడై దిగి పోయెను. కాలేజీ విద్యార్థులు జయపెట్టుచు కామకవిని దింపిరి. కొంతనడికి రైలు అలుపుసొలుపులులేని తన నడకను క్రమ్మఱసాగించెను.

స్టేషనునుండి గ్రామములోనికి జననిర్ఝరి బయలు దేఱినది. కామకవియే దానికడపటి బిందువు. అతఁడేదియో లోప మొనరించిన వానివలెఁ బెండ్లి యిల్లు చేరెను.

3

కామకవికి పెండ్లిసందడియంతయు ముండ్లదండడివలె నుండెను. అనంతకృష్ణశాస్త్రి చేసిన నింద ఒకమూర్తి దాల్చి అతని కనులఁ ద్రేలుచుండెను. అతఁడు:—

"ఆపరితోషా ద్విదుషాం
న సాధు మన్యే ప్రయోగ విజ్ఞానమ్;
బలవదపి శిక్షితానా
మాత్మ న్యప్రత్యయం చేతః"

అను పద్యము నూరక చదివికొనుచుండెను.

స్తుతింపుము; గుండేని యెగుగును. నిందింపుము; బెండేని క్రుంగిపోవును. స్తుతిని తేనెనుండియు, నిందను తేనెటీఁగల ముండ్లనుండియు తీసియుందురు. ఈ రెంటికి చిన్ననాఁటనుండియు శాశ్వతికమగు పోరు.

కామకవి స్తుతి కుబ్బలేదుకాని నిందకు క్రుంగిపోయెను. పండితు లన్నచో నతనికి భయమెత్తెను. పాణినియు నన్నయయు వ్యాకరణములు వ్రాయకుండిన నిటువంటివారి కెంతటి మేలు? అతనిలోనిపుడు పాణిని నన్నయాదులందు శ్రద్ధాబీజము పడెను. ఏమనఁగా పెండ్లికి వచ్చిన బంధువులలో పండితు లందఱు "కామకవీ! ఏమి చదువుచున్నావు?" అని అడిగినపుడు తాను గుటకలు మ్రింగుటకన్న నేమి ప్రత్యుత్తర మీయఁగలఁడు? శిష్య

లను జూచినపుడు తన్నేమి వెంటబడి యడిగిపోదురో యని బెంగపడి వారికి దూరముగా వర్తించుచుండెను. శిష్యులు నిక్కముగా వేటకుక్కలు. వారు ఇతర శిష్యులను ఉడుములవలె వెంటాడుదురు. కామకవికి వారి గాటు బాగుగా తెలియును.

సదస్సున అవధానులు వేదము చెప్పిన పిదప, పండితులును శిష్యులును కొన్ని శ్లోకములతో ఆశీర్వదించి వానికి మూడు, నాలుగు, ఐదు, ఆరు అర్థములు చెప్పినపుడు కామకవికి శాస్త్రమురాని లోపము ఉద్దముగ చూపించినటులాయెను. అపుడతడు మున్మొదట గురువుగారికిని తనకును గలిగిన మార్గభేదమును స్మరించెను.

కామకవి ఇల్లు చేరెను. వివాదపడిన గురువుకడ చదువ నతనికి చిన్నతనము తోచెను. కొన్నాళ్లకు తిరుపతి వెళ్లి అచటిపాఠశాలలో వ్యాకరణశాస్త్ర మారంభించెను. తెరుపాటయినపుడెల్ల కొన్ని వ్యాకరణసూత్రములను పద్యములలోనికి మార్చుచుండెను. అందొకటి యుదాహరించుట అనావశ్యకము కాబోదు.

క. 'హలోఘ' యను ఝల్ పరంబున
ప్రత్యాఘం బగువో బదాంత మొసరిన చోనుర్,
హోఘా యగు 'లిహ్ + సు' అనగ
రూఢిగ 'లిఢ్' అగు బదారురుక్షువులారా!

ఇటులే కువలయానంద మంతయు పద్యములుగా మారుచున్నది. అమరము బట్టీపట్టి నోరికానుపదములు నేర్చుకొనుచున్నాడు. ఇంక దనమానసము విశాలమయినపుడు చెప్పు ప్రతిపద్యమునందును ఏశ్లేషయో, ఏగూఢవ్యంగ్యమో, ఏప్రాసమో లేకుండ లేదు. తొల్లి తనపద్యములను వినిపించి ఇతరుల నానందపరచువాడు. కామకవిమట్టు జనులు మూగుచుండువారు. ఇపుడో ఏకాంతమందు తనపద్యములు తానే చదివి తానే యర్థము చెప్పికొని తానే ఆనందించుకొనుచున్నాడు.

కొన్నాళ్ల కతనికి కవిత్వము చెప్పుటకే తీరిక లేకపోయినది. గురువుగారు చెప్పిన పాఠమును వినుట తాను మరల చూచికొనుట, ఇంకొకరికడ చింతనచేయుట, తెలివితక్కువవాని నొకనిచూచి వానికి తాను మరల చింతనచెప్పుట, వెనుకటి పాఠము లేకరువు వేసికొనుట, ముందుగ్రంథము చూచికొనుట. వీనితో అతనికి గాలి గూడ బీల్చికొనుట కవకాశము లేకుండబోయినది. అతడిపుడు *కవిత్వపు Vacuum అయినాడు.

కవిత్వ మెంతెంత అడుగు పట్టినదో శాస్త్ర మంతంత పెరుగుచువచ్చినది. కామకవి క్రమముగా భాష్యాంతము వ్యాకరణము, బాధాంతము తర్కము, అలంకారశాస్త్రము చదివికొన్నాడు. శాస్త్రాభ్యాసము పూర్ణమయిన పిదప ఇల్లుచేరెను. శిష్యులు పలువురు చేరిరి. అతనికి ఇపుడు పాఠములు చెప్పుటతో సరిపోవుచున్నది. నడుమనడుమ పూర్వవాసనల వలన ఒకటిరెండు పద్యములు చెప్పుచు వచ్చుచున్నాడుగాని వానిని శిష్యులు తక్క ఎవరును ఆలకించుటలేదు. పూర్వపరిచయమువలన ఇతరు లెవరేని విననారంభించినను పూర్తికాకమునుపే లేచిపోవుచు "బల మల్లిపోయినది" అని అనుకొందురు. కామశాస్త్రి వీరికేమియు తెలియదని లోలోపల ననుకొనుచుండును. శిష్యులుమాత్రము గురువుగారు చెప్పిన సారస్యములను వారములకు వెళ్లినపుడు వారివారికి బోధించుచుండువారు; కాని వారు 'మాకు కొబ్బరికాయలు నలదమ్మా, అరటిపండ్లు కావలయు'నని అనుచుండువారు. శిష్యులు, విద్వత్కవిత్వ మనగా 'గొల్లసుద్దులును సువ్వాలపాటలునా?' అని అనుచుండువారు.

౪

ఆంధ్రదేశమున శతావధానసభలు, అష్టావధానసభలు, ఆశుకవితాసభలు వేలపువెట్టిగా జరిగిన పిదప ఆలోచించి ఆలోచించి వ్రాసియుంచిన ఖండకావ్యములను, భావకవిత్వములను, పాటలను వినిపించు సభలు

* గు. కవిత్వపు డొల్ల.

చిత్రవిచిత్రముగా జరుగుచున్నవి. ఒక ఉపన్యాసకునకు మఱొక యుపన్యాసకునకు పొత్తుకలియుట లేదు. వక్తలు చెప్పునది శ్రోతలకు తెలియుటలేదు. ఇంచుమించుగా ఆకాలమున కవిత్వపు అరాచకము ఉదయించినది. విమర్శకులు వింతవింతల సిద్ధాంతముల నెలకొల్పఁ దొడఁగిరి. అపు డెంతమంది కవులు బయలుదేఱిరో అంతమంది విమర్శకులును వారికి సహోదరులవలె బయలుదేఱి వారికవితలమీఁద దీర్ఘ విమర్శనములు వ్రాయుచుండిరి.

పూర్వపరిచితివలన కామకవికిఁగూడ ఒక సమితి తరఫున ఆహ్వానము వచ్చినది. ప్రకృతము కామకవి కడ తాను శాస్త్రాభ్యాసము చేయుకాలమున రచించిన పద్యములు తక్క మఱివిశేషపద్యము లేమియు లేవు. అతఁడు వానిని వ్రాసియుంచుకొనలేదు గాని అతనికడ చినుఁగని తగులఁబడని—ఎత్తుకొనిపోఁబడని—ధారణాగ్రంథ మొకటి కలదు. కామకవి తత్సామగ్రితో ఉపన్యాస వేదిక నెక్కెను. అతఁ డాధారణాగ్రంథము విప్పి ఒకపద్యము చదివి దానికి వ్యాఖ్యాన మారంభించెను. ఒకొక్కపదమే నిర్వచించుచు ప్రయోగముల నుదాహరించుచు తాత్పర్యము చెప్పుచుండెను. సభ్యు లొకరి మోము ఒకరు చూచుకొనుచుండిరి.

కొంతవడి కొకసభ్యుఁడు లేచి వినయముతో "అయ్యా, వ్యాఖ్యానము చెప్పనక్కఱలేని పద్యములు మాత్రమే చదువుఁడు. అథవా వ్యాఖ్యానమేని మానుఁడు" అని కోరెను.

కామకవి వ్యాఖ్యానముమాని మూలము చదువుచుండెను. 'ఇది అరబ్బీ'అని ఒకఁడు, 'పాండిత్యముయొక్క కవితావేషము'అనిఒకఁడు,'Galvanised iron'అనియొకఁడు అఱచుటకు వెనుదీయులేదు.

అందఱు 'కామకవి కామశాస్త్రి అయిపోయినాఁ' డనిరి. అగ్రాసనాధిపతియు కామకవియుఁదక్క సభ్యులెంత సేపో లేరు. కామకవికి కవితాసమితుల కాహ్వానము మఱి రాలేదు.

కామకవి ప్రథమగురువుతో వివాదమును, కాలేజీ విద్యార్థులస్తుతియు అనంతకృష్ణశాస్త్రి మందలింపును, నేఁటి సభ్యులయనాదరమును తలపోసి 'లోకోభిన్నరుచిః' అనుకొన్నాఁడు. అతనికి సభ్యులపై కొంచెమాగ్రహము కలుగకమానలేదు. "శాస్త్రవాసన యిసుమంతయు నెఱుఁగని వీరి కేమి తెలియును? లోకమునకు నచ్చుపుస్తక మొకటి రచించి యచ్చొత్తించినఁగాని నాసంగతి వీరి కెఱుకపడదు" అని అతఁడు తలఁచెను.

అష్టాదశవర్ణనముల చిత్తా, విభావానుభావసంచారిభావ వ్యభిచారి భావముల లక్షణము, శతాధికాలంకారములు, సర్వవ్యంగ్యములు, నిఘంట్వారణ్యానిలో అసూర్యంపశ్యములైన పదములు, బంధముల జాబితాలు కంఠబద్ధము లయియే యున్నవి కావున అతఁడు వానిని ప్రతిపదమందు భావించి భావించి ప్రబంధరచనకుఁ గడఁగెను. విద్యార్థులకు వేళకు పాఠ మందుట లేదు;ఒక్కొక భోజన మసలు లేనేలేదు. ఇంటివా రెవరికిని వేళకు భోజన మందుటలేదు.

కొన్నాళ్లకు ప్రబంధము తయారయినది. ఆలోచించి ఆలోచించి దానికి రెండు పేరులు పెట్టినాఁడు. ఒకటి 'కవితా విజయ'మని; రెండు 'కావ్యరాజ' మని.

చూడవచ్చిన ప్రతిపండితుని పది రోజు లుంచుకొని వినిపింప మొదలిడినాఁడు. ప్రతిపదసారస్యమును త్రవ్వి చూపుచున్నాఁడు. పండితులంతఱు'అమ్మా' అంటే 'అమ్మా'అన్నారు. కామకవి ఒకనాఁడు పని కట్టుకొని పోయి అనంతకృష్ణశాస్త్రి కాప్రబంధమును వినిపించి ప్రశంసాపత్రికను తెచ్చికొనెను. కామకవి తనజన్మము సఫల మయిన దనుకొనెను. ఎవరు తనను నిందించిరో వారే తనను నుతించుటకంటె విజయము వేఱెచటనున్నది? దానిసబ్బు నదియే గడించుకొనుననుగర్వముతో ఏరాజునకు దానిని కృతియీయకయే అప్పు తెచ్చి 'కవితా విజయ'మను మాఱుపేరుకల ఆ'కావ్యరాజము'ను అతఁడు అచ్చు వేయించెను.

స్వరూపము తాల్చిన ఆసరస్వతి తనయింట నధివసించుటకు పదిరూకలువెచ్చించి ఒక బీరువా నతఁడు చేయించి ఆపుస్తకముల నతిశ్రద్ధతో నతఁడు చక్కగా అందు పేర్చెను. పత్రికలలో అడ్వర్టైజ్ మెంట్లకు ఇన్నూఱు రూకలు వ్యయపఱిచెను. రిప్లై కార్డులు అచ్చొత్తించి గ్రంథభాండాగారముల కన్నిటికిఁ బంపించెను. నోటీసు లచ్చువేయించి కవర్లలో పెట్టి గొప్పవారికిఁ బంపించెను. పోస్టునకు విరామము లేని పని కలిగెను.

మొత్తము మీఁద పది పదేనుగురు పుస్తకమును వి. పి. గా పంపవలసినదని లేఖలువ్రాసిరి.

గ్రంథభాండాగారాధిపతుల కడనుండి "అయ్యా! మేము పది సంవత్సరములనుంచీ ఈభాండాగారమును నడుపుతూ వున్నాము. మేము విద్వత్కవులు రాసే పుస్తకాలకే ఎక్కువ ప్రాధాన్య మిస్తాము. జగత్పండితులును విఖ్యాత కవులును అగు మీరు రచించిన ఈకావ్యరాజముచే మాభాండాగారము నలంకరించుకొనవలె నని తీర్మానించుకొన్నాము. అయితే సరస్వతి కుండే సహజ దారిద్ర్యముచే ఉచితముగా తమగ్రంథమునుదయచేయుఁడని ప్రార్థిస్తూ వున్నాము" అని రిప్లై ఉత్తరములు కామకవి కడకు ప్రవహింపఁ జొచ్చినవి.

మఱికొందఱికడనుండి—"అయ్యా! నేను గ్రంథములు కొనఁదగినంత ధనికుణ్ణికాదు; అయితే, చిన్నప్పటి నుండీ చదువుమీఁద వుండే ఆసక్తివల్ల ప్రతిగ్రంథమూ చూడాలనే ఆశ అధికంగా వుంది. ఎంతమంది ఎన్ని మాటలుచెపితే ఏమి ప్రయోజనం? తమకవిత్వానికి మిగతావన్నీ పిపీలికాయమానాలు. ఈ కవరులోనే తాము గ్రంథం పంపడానికి పోస్టుబిళ్లలు పెట్టుకోవడ మైనది" అని ప్రార్థనలు వచ్చుచున్నవి.

ఇటువంటి ప్రార్థనాపత్రికలు చూచుకొనుటకంటె ధనపత్రమును చూచుకొనుటయే కామకవి కష్టతరము. ఎటు చూచినను ఒకఆర్డరు కనఁబడుట లేదు. అతనికి బీరువాచూచుచో భయము పుట్టుచున్నది. అం దేవస్త్రమిడికించను తావు లేదు. పైఁగా ఇంటిలో చాలస్థల మాక్రమించినది. రోజులు కడచిన కొలఁది పుస్తకముల మీఁద బూఁజు పెరుఁగుచున్నది. ఎల్కుల్లి కొకతూరి దుల పనిమొడల చెద లెక్కుచున్నది.

కామకవి పండువులలో విమర్శకుల నింటికి విందులకు పిలిచెను. కవిత్వము, కావ్యము, రసము, భాష ఈ మొదలగువానిపై తనపాండిత్యిని వెల్లడించి, తనకావ్యరాజములోని కొన్నిపద్యములు వినిపించి, వ్యాఖ్యలు కురిపించి దానిని పత్రికలలో విమర్శింపవలసినదని ప్రస్తావించెను. విమర్శకులు కావ్యరాజముపై దీర్ఘవ్యాసములువ్రాసి పత్రికలకుఁ బంపిరి. కాని ఏపత్రికయు ఆవ్యాసములను బ్రకటింపలేదు. కామకవి ఆర్డర్లకు నిరీక్షించెను గాని వృథా ఆయెను. "ఇన్నిరూపాయలుపోసి అచ్చు వేయించితినిగాని అచ్చుఖర్చైన మళ్లి లేదు" అని చింతించెను. బీరువాతలుపు తీసి చూచినపు డతనికాపుస్తకములు పితృదేవతలశల్యములవలెఁ గానఁబట్టుచున్నవి. మచ్చునకు కొన్ని యిచ్చుచో వ్యాప్తికలుగునను నమ్మకముతో ఉచితముగాఁ గోరినవారి ఉత్తరములు వెదకి కొన్ని నశ్చేటుగా పంపెనాఁడు; కాని అవికొన్నాళ్లకుతిరిగివచ్చినవి. "అయ్యయో!—నమః ప్రామాణ్యావాదాయ మత్ కవిత్వాపహారిణే" అని అనుకొన్నాఁడు.

శిష్యుల కందఱకు కావ్యరాజము పాఠము చెప్ప మొదలిడినాఁడు. మొదట ప్రథమగురువుపై తన కెంత కోపము వచ్చినదో కవిత్వము చెప్ప నేర్చిన కొందఱు శిష్యులకు తనపైని అంత కోపము వచ్చినది. ఆకోపమే వారిలోని కవితావాసనను పూర్తిగా జాగరిల్లఁ జేసినది. మఱివారికి పాఠము చెప్పనక్కఱలేకపోయినది; కాని,కవితావాసన లేనిశిష్యులు కావ్యరాజమునే ఒకశాస్త్రముగా పఠింపఁ దొడఁగిరి.

కామకవి బస్తీలలోనున్న తన శిష్యులకందఱకు 'మీరును మీ అనుయాయులును' ప్రతి పుస్తక శాలలోను "కావ్యరాజము కలదా? కావ్యరాజము కలదా?" అని పలుమాఱులుఅడుగవలసినది' అని ఉత్తర

ములు వ్రాసెను. వారిలో నెవ్వరును గురువాక్యమును జవదాఁటలేదు. పదిమంది పదిపర్యాయములు అడుగుటతోడనే కావ్యరాజములకు (Demand) ఉన్నదని షాప్‌కీపర్లమనస్సులకు నాటినది.

అపుడే ఆంధ్రపత్రికలోను కృష్ణాపత్రికలోను 'కావ్యరాజము; ఇది యొక మహాకావ్యము; విద్వత్కవులయిన కామశాస్త్రిగారిచే విరచితము; విమర్శకశేఖరులైన విశంకటశాస్త్రిగారిచే విమృష్టము; కొలఁది ప్రతులే కలవు; ఈనెలలోఁగా తీసికొను వారికి రెండురూకలు మాత్రమే. వలయువారు గ్రంథకర్త కామకవిగారికి, బెజవాడ అనివ్రాసినఁ బడయఁగలరు' అని చిత్రమైన డిజైనుల మధ్య అడ్వర్టైజ్‌మెంటు ఆకర్షకముగా మఱల ప్రకటింపబడినది.

పుస్తకములకు ఆర్డర్లు రాఁదొడఁగినవి. కామకవి కత్తెర చేత పుచ్చుకొని కాకితములు కత్తిరించి పాకెట్లు కట్టి వి. పి. లు పంపెను. కామకవి బీరువా సగము ఖాళీ అయి అంగళ్లబీరువాలలో క్రిక్కిఱిసినవి. అచ్చోటినుండి అవి విముక్తి కాలేదు. ఇపుడు దుకాణదారులు వాని విముక్తికి తీవ్రముగా ఆలోచించుచున్నారు.

విబుధాలాపము

కల్లూరి వెంకటసుబ్రహ్మణ్య దీక్షితులు గారు

శ్రీలలనాధినాథ! బుధసేవితపాదసరోజయుగ్మ! ప్ర
క్షాళిత సర్వదైత్యకుల గర్వ! నమస్కృతు లయ్య నీకు, వి
శ్వాలయ! కావవే వరద! పారములేని విపత్పయోధిలో
దేలుచు మున్గుచున్న మము దేల్చి దయామయ! దీనరక్షకా!

ఉ. కొండల నెత్తినావు మును గొల్లలకుం జెలికాడవై మహో
ద్దండ గభీరఘోరతర దర్ప ఫణీంద్ర ఫణాంతరంబులం
దాండవ మాడినావు సముదగ్ర పరాక్రమ! యాదశాస్యునిం
భండనమందు గూల్చు టొక భారమె నీకు సజాంతరక్షకా!

శా. చింతంజేసి భవద్దయామృతరస శ్రీబిందుసందోహముం
బొందంజేతువు *పాదుకట్టెనయిన న్పూర్ణోన్నతు ద్దేవ! మా
యం దింతైన కృపారసం బిడవు మాయాలాప మాలింప వే
మెందు న్నోబెదువార మీ విటు లుపేక్షింప న్నిలింపాశ్రయా!

మ. స్థిరత న్ముప్పదిమూడుకోట్ల విబుధు ల్దిక్పాలు రర్కాదులుం
సరవిం స్వోన్నతి కర్హమైనగతి దాస్యంబందు వర్తింప ము

* పాదుకట్టె: మురళి అని అర్థాంతరము గ్రహించునది.